# కలల పంట

చక్రపాణి చేతిలో సిగరెట్‌తో చెయ్యి వూపుకుంటూ నా ఆఫీసు గదిలోనికి జొరబడ్డాడు. కూర్చోకుండా "నా జీతం తీసుకోడానికి వచ్చాను" అన్నాడు. మాటాడకుండా సేఫ్ విప్పి కవరు అందిచ్చాను. చేతిలో సిగరెట్ లేదు. ఆ కవరు ఎడమ చేతితో అందుకుంటూ కుడిచేతిని నాతో కరచాలనం చెయ్యడానికి ఎత్తాడు. అదే - ఆ చెయ్యి నెల రోజుల క్రితం చూసిన చెయ్యి. ఉబ్బిపోయి వుంది. "నువ్వు చచ్చిపోయావు కదా! ఇలా ఆఫీసుకు వచ్చి, నీ స్నేహితులను ఎందుకు భయకంపితులను చేస్తున్నావ్?" అని అడిగాను. వెంటనే జవాబుగా "ఇంకా మమకారం తీరలేదు. పగలే తిరుగుతున్నాను. చీకటి పడగానే నా ఇంటికి వెళ్లిపోతున్నాను." "ఎక్కడుంది నీ ఇల్లు?" అని నిలదీసి అడిగాను. "అదే - ఆ రోజు నువ్వు కూడా చూశావు కదా - ఆ శ్మశానంలో ఆగ్నేయ మూల... అదే ఇప్పుడు నా ఇల్లు" అంటూ తిరుగుముఖం పెట్టి వెళ్ళిపోయాడు.

అర్ధరాత్రి మీద కన్న కల ఇది. తెలివి వచ్చాక ఒక్కసారి శరీరం అంతా వణికింది. చక్రపాణికి నాకూ వున్న అనుబంధం అలాంటిది. బహుశః తన పెళ్ళాం, కొడుకుతో చెప్పుకోని విషయాలు నాతో చెప్పుకున్న సహృద్యాయి. చక్రపాణి సడన్‌గా చనిపోయేటప్పుడు నేను వూర్లో లేను. శవాన్ని కొడుకు వచ్చేవరకూ అయిసులో పెట్టి వుంచారు. నేను శవ దహనం ముందే చూడగలిగాను. అప్పటికి అతని శరీరం వుబ్బిపోయి వుంది. పోల్చుకోలేనంతగా మారిపోయింది.

చక్రపాణి దగ్గర బంధువే - రంగారావు ఆ వేళ అంత ఏడ్చాడు కదా! అతని కూతురు పెళ్ళికి నా ఒక్కడికి తప్పించి ఎవరికీ తెలియకుండా పదివేలు అప్పు ఇచ్చాడు చక్రపాణి. దాని వడ్డీ లేదు, పోనీ అసల్లో కొంతైనా తీర్చలేదు. ఇప్పుడు అసలు అప్పు తీసుకోనట్లే హాయిగా వున్నాడు. చక్రపాణి భార్యామణి రేఖ వుండే - ఎప్పుడూ మొగుడి మీద విసవిసలాడేది. కొడుకుతో కలసి ఒకోసారి పోట్లాటకే వచ్చేసేది. మనసులో వున్నదొకటి, మాటల్లో దొర్లేది వేరొక్కటి కాని బ్రతుకు చక్రపాణిది! తన మాట కాదని, తనకు చెప్పకుండా దూరంగా ఒక పిల్లను పెళ్ళి చేసుకున్నాడని చక్రపాణి నిప్పులు గక్కాడు. "ఇంత చదివించి పెద్ద చేశాను. ఇన్ని హంగులతో ఇల్లు కట్టించాను. ఇదంతా ఎవరి కోసం? నా కోసమా? వాడు హాయిగా పెళ్లాం పిల్లలతో వుంటాడనుకుంటే - కనీసం నాతో చెప్పి పెళ్ళి చేసుకుని వుంటే నాకు తృప్తి వుండేది కదా! నా కళ్లు కప్పి అంత చేశాడే! అలాంటి విషాద

ఘడియల్లో నన్ను ఆదుకోకుండా నా భార్య నా కొడుకు పక్షం చేరి నన్ను చెరిగి చెండాడుతోంది..." అని ఆ రోజుల్లో చక్రపాణి నాతో చెప్పుకుని ఏడ్చాడే...

ఇలా చక్రపాణి ఆర్జనతో, ఆదరణతో, ఆప్యాయతతో బాగుపడిన వాళ్లెందరో వున్నారు. చచ్చిన తర్వాత తల బాదుకుని ఏడ్చారు. ఆ చచ్చిన శవం పాదాలను ముట్టుకుని తల వాల్చి కొట్టుకున్నారు. అలాంటి వాళ్లెవరికీ కలలోనైనా కనపడలేదట!

అయితే నాకే ఎందుకు కలలో కనిపించాడు? చక్రపాణి బ్రతికి వున్నప్పుడు అతని గురించి అంతగా పట్టింపు చేసుకోలేదు గానీ, చనిపోయాక ఈ నెల రోజుల్లో ఇంచుమించు ప్రతిరోజూ అతనిని తలచుకునే వుంటున్నాను. కారణం? అతను చేసిన పనులు ఒక్కొక్కటి జ్ఞప్తికి రావడం - అసలు ఇప్పుడే ఆ చేసిన పనుల్లో దాగివున్న మానవత్వం, ప్రేమ, అభిమానాలు పువ్వులు విడిచినట్టుగా ప్రత్యక్షమౌతున్నాయి. నాకు ఒకసారి పెద్ద జబ్బు చేసింది. ఆసుపత్రిలో చావు బ్రతుకుల మధ్య పెనుగులాడుతున్నప్పుడు, రాత్రి పగలు నన్ను అంటిపెట్టుకుని వున్నాడు. తను నవ్వుతూ. చక్రపాణి నన్ను నవ్వించే ధైర్యమైన మాటలే బహుశః ఆ మందులకన్నా బాగా పనిచేశాయేమో? నేను కోలుకోడానికి నెలరోజులు పట్టినా, విసుగంటూ ఎరుగని మనిషి - నా వెంట వున్నాడు. నేను అడక్కుండా నాకు కావలసినవి తెచ్చిపెట్టేవాడు. మా నాన్న పోగానే "నీ దుఃఖం పోయేవరకూ ఏడ్చుకో"మని నన్నో చోట కూర్చోబెట్టి ఆ రోజు అన్ని ఏర్పాట్లు తనే చేశాడు. నెల రోజులైనా ఎంత అయిందో ఖర్చు చెప్పడు. డబ్బు ఇవ్వడానికి వెళ్తే "మా నాన్న పోతే నువ్వు ఖర్చుపెడ్తావనుకో - నేను డబ్బు ఇస్తే పుచ్చుకుంటావా?" అన్నాడు.

ఎక్కడికి వెళ్ళినా ఏం తెచ్చినా మా పిల్లల వాటా వచ్చేది. రక్తసంబంధాలు లేకపోయినా చక్రపాణి మా కుటుంబంలో ఒక మనిషైపోయాడు. అయితే చక్రపాణి చనిపోయిన్నాడు గానీ, శవ దహనం చేసినప్పుడుగానీ నేను ఏడవలేదు. అంత మంచివాడు కాబట్టి సునాయాసంగా చచ్చిపోయాడు. ఎంత అదృష్టవంతుడో... లేక ఎవరైనా ఏదో ఒక రోజున బుగ్గి కావలసిందేనన్న శ్మశాన వైరాగ్యం రావడం వల్లనో ఎందుకో ఏమో ఏడవలేదు. కానీ అతను బ్రతికి వున్నప్పుడు అతను నాతో చెప్పుకున్న కష్టాలు విని సానుభూతితో ఒకోసారి నా కళ్ళు నీటితో చెమ్మగిలేవి. చక్రపాణి చిన్నప్పటి నుంచీ జీవితంతో పోరాటం సాగిస్తూనే వున్నాడు. పుట్టిన ఏడాదికి తల్లి పోయింది. తండ్రి తాగుబోతు. తాత పెంచినా, తలనొప్పులు తగువుల బాధలు పడి, ఏలాగో తన అన్నం తాను తినే ఉద్యోగం సంపాదించుకున్నాడు. కానరాని కడుపులో మంట ఇలా తీరిందంటే, సంసార బంధంలో కంపలో ఈగలాగ కొట్టుకున్నాడు.

చక్రపాణి బ్రతికి వుండగా భార్యగానీ కొడుకుగానీ అతని వల్ల బాగుపడ్డ వాళ్ళెవరుగానీ అతని గురించి బాధపడలేదేమో? వాళ్ల ఆవేశాలు, అవసరాలు ఎలా తీర్చుకోవాలోనన్న ఆరాటంతో అతని గురించి ఆలోచించలేదేమో? లేక వాళ్లందరూ తన విషాదగాథను వినడానికి అర్హులు కారని ఊహించాడేమో? వీళ్ళంతా చక్రపాణి చనిపోయి నెలరోజులైనా ఇంకా అడపా దడపా ఎందుకేడుస్తున్నారు? బ్రతికి వాళ్ళని సాధించలేని చక్రపాణి, చచ్చాక దెయ్యమై తన మనసులో ఆక్రోశాన్ని, పగను దావానలంలానో, విష వాయువులానో వాళ్ల మీద వదిలి నాశనం చేస్తాడనా?

బ్రతికుండగా పొగడనివాళ్ళు, చచ్చాక అతనిని అంతగా కీర్తిస్తున్నారెందుకు? ఈ భయంవల్లనేనా?

ఇలా భయపడ్డ వాళ్ళెవరికీ అతను కలలోనైనా కనిపించలేదట. అలాంటిది నాకే ఎందుకు కనిపించాలి? ఆ చేతులు వుబ్బినట్టు ఎందుకుండాలి? బ్రతికుండగా బలవంతాన శరీరంలో దాచుకున్న కన్నీరు చచ్చాక శరీరమంతా ప్రాకి వుబ్బిపోనిచ్చిందా? జీవితంలో కష్టాలను దాచడానికి ప్రసరించిన నవ్వు చచ్చాక దివ్యరథమై, తన మమకారాలను తీర్చడానికి ఇలా త్రిప్పుతోందా? జీవితంలో ఆశించింది ఒకటి, జరిగిందొకటైతే, ఏడవలసినప్పుడు ఏడవకుండా, నవ్వవలసినప్పుడు నవ్వకుండా కోరికలను, మనస్సును కట్టివేస్తే, బహుశః చనిపోయాక కూడా ఆ జీవి గతిలేక, మతిలేక శ్మశానాలవెంట తిరుగుతుందేమో?

గోడ గడియారం రెండు గంటలు కొట్టేవరకూ చక్రపాణి ఆలోచనలతో మనసు నిండిపోయింది. అతని జీవితం తలచుకున్న కొలదీ నాకు భయం బదులు, అతనిపై జాలితో మనస్సు నిండిపోయింది. చీకటిలోనే ఇంకా ఆలోచించుకున్నాను.

కాస్సేపు చక్రపాణి నించి మనసు మళ్లించుకుని ఒక అరగంటలో నిద్రపోయాను. ఒకసారి కలలో కనిపించిన మనిషి మళ్ళీ రెండోసారి కనిపించడన్న ధీమా నిద్దరపట్టనిచ్చింది. మళ్లీ తెల్లవారుఝామున కలలో చక్రపాణి కనిపించాడు. కోపంగా నా ఆఫీసు గదిలోకి రొప్పుకుంటూ వచ్చాడు. అలాంటి రౌద్రావేషంతో చక్రపాణి బ్రతికుండగా ఛూడలేదు. అందులో చిన్నచెడ్డీ తప్పించి ఒంటిమీద బట్టలేదు. శరీరం అంతా వుబ్బి భయంకరంగా కనిపిస్తున్నాడు. నేను అతనికిచ్చిన కవరు నా మీదకి విసురుతూ "నీవు ఒక్కడివే నా అసలైన సిసలైన మిత్రుడవని నమ్మాను. నువ్వు కూడా నన్ను మోసం చేస్తావా?" అన్నాడు. నాకేం అర్థం కానట్టు గాబరా పడుతూ గజగజ వణికిపోతున్నాను.

"నా జీతం అడిగితే ఈ సంచిలో చెత్తకాగితాలు ముక్కలు పెట్టి ఇస్తావా? ఇది నీకు న్యాయమేనా?" ఖస్సుమని అరిచాడు.

చప్పున తెలివి వచ్చేసింది. పరుపు మీద నించి గెంతి లైటు స్విచ్ వేశాను. నుదుట చెమట. చేతులు చొట్టదేరిపోతున్నాయి. కాస్సేపు మెదడంతా ఖాళీ అయిపోయింది. పెద్దగా వూపిరి తీస్తున్నాను. గుండె ఆగిపోతోందా అన్న భ్రమ కలిగింది. కడుపులో మంట అనిపించి గడగడ గ్లాసుడు మంచినీరు త్రాగేశాను. కాస్సేపటికి శరీరం కాస్త సర్దుకుంది. మనసు కుదుటపడి చిన్న మెరుపులాంటి తలపుకు చోటిచ్చింది. అలా వెలుతురులోనే పరుపుమీద దిండుకు చారబడి కూర్చున్నాను.

అవును - చక్రపాణికి అసలైన సిసలైన స్నేహితుడ్ని నేనే. అందుకే అతను ఎవరి మీదా చూపించని అభిమానం నా మీద చూపించాడు. నా కష్టాలను తన కష్టాలనుకున్నాడు. ఇంచుమించు నా విషయంలోనైనా బ్లాంక్ చెక్ చేత పెట్టిన పని చేశాడు. ఇన్ని సంవత్సరాల స్నేహంలో నేను అతని దగ్గర నుంచి అందుకున్నదే అంతాను! నేను తిరిగి ఇచ్చిందేమీ లేదు. అతను ఎప్పుడూ ఏమీ అడగలేదు. కనీసం అతని కష్టాల్లో నా సానుభూతినైనా కోరలేదు. అలా అని అతనికి అవసరాలు లేవనుకోవడం పొరపాటు. ఇది కావాలని అందరూ కోరలేరు. అతని అవసరాలేవో కనీసం అతను బతికుండగా నేను తెలుసుకుని, నాకు సహాయం

చేసినట్లే నా పరిధిలో నేను అతనికి సహాయం చెయ్యవలసింది. అతని ఆతిథ్యాన్ని, ఔదార్యాన్ని, అభిమానాన్ని అందుకున్నాక ఏదో ఒక విధంగా వాటినే అతనికి బదులుగా అందివ్వవలసింది. మానవులకు ఇచ్చి పుచ్చుకోవడంలోనే మనుగడ. జీవితం "టూవే ట్రాఫిక్!" బ్రతికుండగా నా వేపు వేలైనా చూపించని చక్రపాణి, చచ్చి కలలో కనిపించి నాకు కనువిప్పు కలిగించాడు. బ్రతికుండగా అతనిచేత వెట్టి చాకిరీ చెయ్యించుకున్నానన్నట్టు ఆ కలలోని చెత్త కాగితాల ముక్కలు సూదుల్లా నాటుకున్నాయి.

నా జీవితంలో ఎన్నెన్నో లెక్కలేనన్ని కలలు కన్నాను. ఇదొక్క కలే నన్ను భయభ్రాంతులతో ముంచెత్తి ఆలోచింపజేసింది. ఈ ఒక్క కలే మిగతా కలలు పండించలేని పంటను పండించింది. చక్రపాణిలా నా జీవితంలో ఔదార్యం, ఆతిథ్యం, అభిమానం, ప్రేమానురాగాలిచ్చిన వ్యక్తులెవరున్నారని ఆలోచించగా, ఇంట్లో, వీధిలో, దేశంలో ఎందరెందరో వున్నట్లు గుర్తించాను. శేష జీవితంలో ఇక పుచ్చుకోవడం చాలించి, ఇవ్వడానికి ఆ రోజునించే మొదలుపెట్టాను.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 29-12-1989)

* * *